

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

### (గత సంచిక తరువాయి)

<u>మనకే సుఖమనుకో 'కో 'య్</u>

సాహిత్యంతో పరిచయం వున్న వారిలో ఓ హెన్రీ పేరు తెలియనివారు ఉండరు. హృద్యమయిన చిన్న చిన్న కొసమెరుపు కథలకు అతడు పెట్టింది పేరు.

తన స్నేహితుడి వాచీకి గిఫ్ట్‌గా స్ట్రాప్ (బెల్ట్) కొనటం కోసం తన పొడవాటి జుట్టు అమ్మేసిన అమ్మాయి, ఆ అమ్మాయి జుట్టుకి క్లిప్ కొనటం కోసం తన వాచీ అమ్మేసిన అబ్బాయి కథ "గిఫ్ట్ ఆఫ్ మేజిక్" దీని ఆధారంగానే చాలా సినిమా సంఘటనలూ, ఇటీవలే హరిహరన్ పాటా వచ్చాయి.

అదేవిధంగా, ఒక రోగిని బ్రతికించటం కోసం చెట్టుకి ఆకు కట్టి చనిపోయిన వ్యక్తి కథ 'ద లాస్ట్ లీఫ్' కూడా హెన్రీదే

హెన్రీ అసలు పేరు విలియమ్ సిడ్నీ పోర్టార్. మందుల షాపులో పనిచేసేవాడు. తరువాత ఆస్టిన్ వెళ్ళి వివాహం చేసుకున్నాడు. చేయని నేరంపై శిక్షపడి ముందు మరో దేశం పారిపోయాడు. భార్యకి క్షయ వచ్చిందని తెలిసి తిరిగి స్వదేశం వెళ్ళి లొంగిపోయి అయిదేళ్ళ జైలు శిక్ష అనుభవించాడు. ఆ జైల్లోనే అతడు కథలు వ్రాయటం ప్రారంభించాడు. ఆ జైలు వార్డెన్ చాలా దయగా చూసుకునేవాడు. అతడి పేరు ఓరిన్ హెన్రీ. ఆ పేరే తన కలం పేరుగా పెట్టుకున్నాడు. ఆ పేరుతోనే ప్రపంచ విఖ్యాత రచయితగా పేరు తెచ్చుకున్నాడు.

<u>రిటైర్‌మెంట్‌కు పైప్‌లైన్</u>

"ఇంకా 22,600రోజులు పని చెయ్యాలి."

పాతికేళ్ళ వయసులో ఉద్యోగంలో చేరిన మొట్టమొదటి రోజు ఎవరూ తమ రిటైర్మెంట్ రోజుని తల్చుకుంటూ అలా పైకి అనుకోరు. కానీ, ఉద్యోగాన్ని ఒక తప్పనిసరి పనిగా భావించేవారు మాత్రం మనసులో ఉద్యోగం నుంచి విముక్తి కలిగించే 'హాలిడే' కోసం నిరంతరం చూస్తూనే ఉంటారు.

ఎన్నో ఆశల్తో ఇంజనీరింగ్ చదివి, హోటల్‌లో రెండువేల రూపాయలకి రిసెప్షనిస్ట్‌గా చేరిన ఒకమ్మాయి ఆ విధంగానే అన్నది. ''ఇలా ఇంకెన్ని రోజులు?''

అంత నిరాశ అవసరంలేదు.

''నువ్వే ఉద్యోగం చేస్తున్నావన్నదికాదు ముఖ్యం. నువ్వు ఉద్యోగం ఎలా చేస్తున్నావు అన్నది ముఖ్యం. 99శాతం మనుష్యులు సామాన్యంగా ఉంటారు. ఈజీగా కన్వీనియెంట్‌గా తెలిసిందే చేస్తూ తెలియని దాన్ని వ్యతిరేకిస్తూ కేవలం అలాగే వుంటారు మరి కొంతమంది తమ ఉద్యోగాన్ని ఛాలెంజిగా, ఆనందంగా తీసుకుంటారు'' అంటాడు క్రిసిన్. ఇతడు ఇంగ్లీషు ఛానెల్‌ని ఈదాడు.

ఇతడికి రెండు కాళ్ళూ లేవు. తండ్రికి తగ్గ తనయుడు

''పైప్‌లైన్'' పుస్తకం వ్రాసిన హెడ్జెస్ బ్రూక్ తండ్రి క్యూబా దేశంలో దాదాపు రెండువందల కోట్ల డాలర్లకు అధిపతి. ''దేన్నీ తేలిగ్గా తీసుకోకు'' అని కొడుక్కు తరచు చెప్పేవాడు. 1959లో క్యూబాపై కాస్ట్రో ఆధిపత్యం వహించి, ధనవంతుల్ని దేశద్రోహులుగా ప్రకటించాక, ఆ కుటుంబం జమైకాకు కట్టుబట్టల్తో వలస వెళ్ళిపోయింది.

పైప్‌లైన్ పుస్తకానికి ప్రేరణ 'కియోసాకి' అన్న రచయిత ఉపన్యాసం. 'కియోసాకి' వ్రాసిన రిచ్ డాడ్ - పూర్ డాడ్ గురించి నా పుస్తకం 'మైండ్ పవర్'లో విపులంగా చెప్పాను.

జమైకాలో బ్రూక్ తండ్రి కొడుకుతో చదరంగం ఆడుతూ, ఎన్నో వ్యాపార విషయాలను చెప్పేవాడు(ట). ఆ ప్రేరణతోనే బ్రూక్ తన 25వఏట మొట్టమొదటి పైప్ లైన్ వ్యాపారం పెట్టినప్పుడు అందరూ నవ్వారు. ఆ తరువాత అతడు పది వ్యాపారాలను పెట్టాడు. ప్రస్తుతం బ్రూక్ హెడ్జెస్ వందకోట్లకు అధిపతి.

నువ్వు ఏదైనా కొత్త పనిచేసి ఓడిపోయినప్పుడు, 'చూసావా. మేము చెప్పాము కదా' అన్న వాళ్ళే, నువ్వు గెలిచినప్పుడు చప్పట్లు కొట్టటం కోసం, తమ చేతుల్ని ఎల్లప్పుడూ ఖాళీగా ఉంచుకుంటారు.

*ఇన్సూరెన్స్ (విఎస్) జాక్‌పాట్*

ఆశవేరు. ఋషి వేరు. జాక్‌పాట్ కీ ఇన్సూరెన్సుకీ వున్నంత తేడా వుంది.

గుర్రప్పందేలు ఆడేవాడికి జాక్ పాట్ రావాలని రూలేమీలేదు. అది 'ఆశ.'

కానీ 'కృషి' ఇన్సూరెన్స్ పాలసీలాంటిది. అది ఎప్పటికయినా ఫలిస్తుంది. మా టి.వి సీరియల్ 'తులసీదళం'కి ప్రొడక్షన్ నిర్వహించిన వల్లూరిపల్లి రమేష్ (ఆ సీరియల్‌లో ఇస్మాయిల్ పాత్ర పోషించాడు) జీవితంలో చాలా కష్టపడి పైకి వచ్చాడు. సినిమా ఫీల్డులో మామూలు పాఠకులు సాధారణంగా ఊహించలేని దారుణమైన అనుభవాల్ని మాకు సరదాగా చెప్పేవాడు. ఒకప్పటి కష్టం, తరువాత 'అనుభవం'గా మారుతుంది కదా!

''1982లో మద్రాసు వెళ్ళి ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా చేరాను. రైలు టిక్కెట్లు కొనితెస్తే, టిక్కెట్టుకి మూడు రూపాయిలు ఇచ్చేవారు. సైకిల్ స్టేషన్‌లో పెడితే రూపాయి ఇవ్వాల్సి వస్తుందని, బుహారీ హోటల్ ముందు పెట్టి అక్కణ్ణుంచి నడుచుకుంటూ వెళ్ళేవాడిని.

ఆ రోజుల్లో కంప్యూటర్లు లేవు. అవుట్ డోర్ యూనిట్ కోసం అరవై టిక్కెట్లు కొనాలంటే, ఆరుకొని, మళ్ళీ క్యూలో లైను చివరికొచ్చి నిలబడాలి. అన్నీ కొనేసరికి సాయంత్రం ఆరయ్యేది. కాళ్ళు పీక్కుపోయేవి. రోజంతా అదే పని. ఆ కష్టం అనుభవిస్తేగానీ తెలియదు.

ఆవిధంగా అరవై టిక్కెట్లూ కొని స్టేషన్ నుంచి ఆరుమైళ్ళు సైకిల్ తొక్కుకుంటూ ఆఫీసుకెళ్ళేసరికి 'హీరోయిన్ అసిస్టెంటూ, మరో ఇద్దరూ రావటంలేదోయ్. మూడు టిక్కెట్లు కాన్సిల్ చెయ్' అనేవారు.

ప్రాణం ఉసూరుమనేది కాదు. ఉక్రోషం వచ్చేదికాదు. సంతోషం వేసేది. మరో తొమ్మిది రూపాయలు దొరుకుతాయని" అంటూ నవ్వేసేవాడు.

అతడు 'నేనూ - సీతామాలక్ష్మి' 'కబడ్డీ - కబడ్డీ' సినిమాలు తీసి చూస్తుండగానే ఏడాదిలో మిలియనీర్ అయ్యాడు. అందరూ అతడిని 'జాక్ పాట్ కొట్టేవోయ్' అని అభినందిస్తూంటే అతడు నమ్రతగా చెప్పేవాడు. "లేదండి. ఎప్పుడో పాలసీ కట్టాను. అది ఇప్పటికి మెచ్యూర్ అయింది" అని జాక్‌పాట్ కొట్టటానికీ, పాలసీ కట్టటానికీ అదీ తేడా.

రాయిని బద్దలు కొట్టేవాడు సుత్తితో వందసార్లు కొడతాడు. అది అలాగే చెక్కు చెదరకుండా వుంటుంది. నూటొకటో దెబ్బకి ఒక్కసారిగా రెండుగా విడిపోతుంది.

అది నూటొకటో దెబ్బ గొప్పతనంకాదు. నూరు దెబ్బల శ్రమ ఫలితం.

*దానం*

సిగరెట్ తాగితే కిక్ వస్తుంది. డ్రింక్ చేస్తే కిక్ వస్తుంది. అదే విధంగా డబ్బువల్ల కూడా మూడు రకాలైన కిక్‌లు వస్తాయని అంటాడు 'ఆలెన్ వైట్.'

అతడు ఒక పెద్ద పత్రికాధిపతి. కోటీశ్వరుడు. తాను పుట్టిన ఊరికి మిలియన్ డాలర్ల యాభై ఎకరాలని పార్క్ నిమిత్తం దానం ఇచ్చాడని తెలిసి అతడి స్నేహితుడు "ఎందుకు ఇంత ఖరీదైన భూమిని అలా ఇచ్చేశావు?" అని అడిగాడట. అప్పుడు వైట్ ఈ విధంగా సమాధానం చెప్పాడు. "డబ్బు మూడు రకాల కిక్‌లు ఇస్తుంది. ఒకటి - నువ్వు దాన్ని సంపాదిస్తున్నప్పుడు, రెండు దానిని నీ దగ్గర వుంచుకున్నప్పుడు, మూడు నువ్వు ఒక మంచి పనికోసం దానిని ఖర్చుపెడుతున్నప్పుడు. ఈ మూడోది మిగతా రెండింటికంటే ఎక్కువ కిక్ ఇస్తుంది."

అక్షర లక్షలు చేసే మాటలు ఇవి. ఫస్ట్‌క్లాస్ లోంచి దిగి, రైల్వే కూలీ దగ్గర గీసి గీసి బేరమాడే లక్షాధికార్లు తెలుసుకోవలసిన సత్యమిది.

ఒకప్పుడు పాస్‌బుక్‌లోని పెద్దపెద్ద సంఖ్యలు నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేవి. అనుకున్న దానికన్నా అయిదు రూపాయలు ఎక్కువవిస్తే, పేపర్ బోయ్ కళ్ళలో కనపడే ఆనందం ఇప్పుడు ఎక్కువ సంతోషాన్నిస్తోంది.

గెలుపుకీ, మార్పుకీ అంతంలేదు

గెలుపుకి అంతంలేదు. అది ఒక నిరంతర ప్రవాహం. రికార్డులు వున్నవి వాటిని బద్దలు కొట్టటానికే. ఓటమిని స్పోర్టివ్‌గా తీసుకున్నమనిషిదే నిజమైన గెలుపు.

స్పెయిన్ దేశపు జీబ్రాల్టర్ ప్రాంతంలో ఒక హెర్క్యులిస్ విగ్రహం వున్నది. ఆ హెర్క్యులిస్ ఒక పెద్ద రాయిని భుజాల మీద మోస్తూ ఉంటాడు. ఆ రాతిమీద NE-PLUS-ULTRA అని వ్రాయబడివుంది. దాని అర్థం ఏమిటంటే 'ఇక్కడ నుంచి ముందు మరి ఏమీలేదు' అని. అక్కడ నుంచి అంతా సముద్రమే. ప్రపంచానికి ఆఖరి దేశం తమదైనందుకు స్పెయిన్ దేశీయులు చాలా గర్వపడుతుండే వాళ్ళు.

ఆ తర్వాత కొంత కాలానికి కొలంబస్ అమెరికాని కనుక్కొన్నాడు. దానితో ప్రపంచపు ఆఖరి దేశం తమదైనందుకు స్పెయిన్ దేశీయులు చాలా గర్వపడుతుండే వాళ్ళు.

ఆ తర్వాత కొంతకాలానికి కొలంబస్ అమెరికాని కనుక్కొన్నాడు. దానితో ప్రపంచపు ఆఖరి దేశం స్పెయిన్ కాదని తెలిసిపోయింది. హెర్కులిస్ బొమ్మనీ, ఆ రాయినీ తీసేయవలసిన పరిస్థితిల్లో స్పెయిన్ దేశాన్ని పాలిస్తున్న రాణి ఇసబెల్లాకి ఒక ఆలోచన వచ్చి ఆ బొమ్మని అలాగే వుంచేసి పైన NE అనే అక్షరాలని చెరిపించి వేసింది. ఇప్పుడు దాని అర్థం "ఇంకా ముందు చాలా ప్రపంచం వుంది."

### జొనాధన్ లివింగ్ స్టన్ సీగల్

1977లో రిచర్డ్ బాక్ వ్రాసిన ఈ పుస్తకం సంచలనం కలుగ చేసింది 'సీగల్' అంటే పొట్టి రెక్కలున్న సముద్రపు కాకిలాంటి జంతువు. సముద్రపు వడ్డునే ఆహారం కోసం రెండు కాళ్ళమీద తిరిగే ఈ సీగల్ గుంపులో ఒకదానిపేరు "జొనాధన్ లివింగ్ స్టన్"

ఆ సాయంత్రం మిగతా సీగల్స్ అన్నీ హుషారుగా డిన్నర్ అయ్యాక ఆ సముద్రాన ఇటూ అటూ తిరుగుతూ వుంటే, జొనాధన్ మాత్రం విపరీతంగా అలసిపోయి నిద్రకు జోగుతూ  ఉంటుంది.

దానికి కారణం చాలాకాలం క్రితమే ప్రారంభం అయింది. ఇసుక కొండల మీదకి ఎగిరి, ఆకాశంలోంచి సముద్రంలోకి నిలువుగా 'డైవ్' చెయ్యాలన్న ఆకాంక్షతో అది ఎన్నో రోజులుగా ప్రయత్నిస్తోంది. ఫెయిల్ అవుతోంది.

ఇదంతా గమనించిన ముసలి నాయకుడు జొనాధన్‌ని గుంపు మధ్యలో నిలబడి క్షమాపణ చెప్పమన్నాడు. "మనజాతికి వీలుకాని ఒక అసందర్భపు పని మొదలు పెట్టావు. మనం పేరుకి మాత్రమే పక్షులం అంతే తప్ప సీగల్స్ ఆకాశంలో ఎగరటం అన్న ఆలోచన ఎవరికయినా వచ్చిందా? పైగా నిన్ను చూసి చిన్న పిల్లలు పాడయిపోతున్నాయి. దొరికింది తినటం మానేసి ఎగరటానికి వృథా ప్రయాస చేస్తున్నాయి. దీనికి నీ సంజాయిషీ ఏమిటి?" అని అడిగాడు.

అప్పుడా పొట్టి రెక్కల స్థూలకాయపు పక్షి ఈ విధంగా అన్నది. "వడ్డుకు కొట్టుకొచ్చిన చేప పిల్లల తలలు తినటం తప్ప కొన్నివేల సంవత్సరాలుగా మనం మరేం చెయ్యలేదు. ఒక కొత్తని కనుక్కోవటంలోనూ, మన బ్రతుక్కి అర్థం తెలుసుకోవటంలోనూ తప్పేముంది?"

"జాతిని చీలుస్తున్నావు నువ్వు" అన్నాడు నాయకుడు సీగల్స్ అన్నీ వెనక్కి తిరిగి వీపులు చూపించి హేళనగా నాట్యం చేస్తూ జొనాధన్‌ని  బహిష్కరించాయి.

అప్పటి నుంచీ జొనాధన్ యజ్ఞం తిరిగి ప్రారంభం అయింది. రాత్రింబవళ్ళు సముద్రం మీదుగా ఎగరటానికి ప్రయత్నం చేసేవాడు. నీటిలో పడిపోయేవాడు. మళ్ళీ లేచేవాడు. పడేవాడు. శరీరం చీరుకుపోయేది. రాళ్ళ అంచులకి రక్తం అంటేది. అయినా ప్రయత్నం ఆపలేదు. పిల్ల పక్షులన్నీ అబ్బురంగా చూసేవి. కొంతకాలానికి నెమ్మదిగా వాలుగాలిలో ప్రయాణం చేయటం నేర్చుకున్నాడు. తరువాత ఎదురుగాలిలో..

చిన్నకొండ శిఖరం పైకి నెమ్మదిగా ఎక్కి అక్కణ్నుంచి సముద్రపు నీటిలోకి దూకటం ప్రాక్టీసు చేస్తూ వుండగా అప్పుడు స్వర్గం నుంచి దిగివచ్చిన మరొక పక్షి చెపుతుంది. "ఈ స్పీడ్ సరిపోదు. వాయువు కన్నా వేగంగా వెళ్ళాలి. స్వర్గం చేరుకోవాలంటే రెప్పపాటు కాలంలో అదృశ్యమయ్యేటంత వేగంగా పయినించాలి. అయినా 'స్వర్గం' ఒక చోట ఆగదు. వెళ్ళేకొద్దీ మరింత సౌఖ్యవంతంగా, ఆనందంగా, ఆహ్లాదంగా కనబడుతుంది" అంటుంది.

జొనాధన్ ఆ వేగంతో ప్రయాణించటం నేర్చుకుంటాడు. సముద్రం మొదలులోనే అలలు వుంటాయనీ, కొంత దూరం వెళ్ళాక వుండవనీ తెలుసుకుంటాడు.

అస్తమిస్తున్న సూర్యుణ్ణి సముద్రపు అంచులో చూస్తాడు.

నీటిపై ఎగిరే చేపల్ని, సముద్రం చివరవున్న వడ్డునీ (అట్నుంచి) చూస్తాడు.

మేఘాల్లోంచి సముద్రాన్ని మొట్టమొదటిసారి వీక్షిస్తాడు.

మేఘంపై నుండి క్రిందకి జారే అనుభవాన్ని ఆస్వాదిస్తాడు.

ఏ సీగల్ తన కలలో కూడా ఊహించలేని అనుభవాన్ని స్వంతం చేసుకుంటాడు చివరికి -

"ఎంత ఎత్తుకి ఎగురుతే పక్షి అంత దూరాన్ని చూడగలదు" అన్న సామెతకి అర్థం తెలుసుకుంటాడు.

వెలివేసిన పక్షుల్లోంచి కొన్ని యువసీగల్స్ జొనాథన్ దగ్గిర శిష్యులుగా చేరతాయి. కొంతకాలం వాటికి ఆ విద్య నేర్పి, తన ప్రథమ శిష్యుడిని వాటికి గురువుగా చేసి, 'స్వర్గా'నికి ఎగురుతూ వెళ్ళిపోతాడు జొనాథన్ లివింగ్‌స్టన్.

రిచర్డ్ బాక్ ఈ పుస్తకంలో చెప్పిన కథలోని ఈ విధమైన సెల్ఫ్ డిస్కవరీ అందరూ తెలుసుకోవలసిన, నేర్చుకోవలసిన గొప్ప సత్యం.

ఈ చిన్న ముప్పై రూపాయ్‌లు ఖరీదు చేసే పుస్తకంలో రచయిత చెప్పేది మనిషి, తనని తాను ముందు తెలుసుకుని ఆ తరువాత తెలుసుకున్న దాన్ని తన వారికి చెప్పాలని. గెలుపు మొదట్లో వ్యక్తిగతం. తరువాత సామాజికం.

ఎంతకాలమయినా పాడవకుండా వుండే ఒక వస్తువు ఏమిటో తెలుసా?

తేనె...!

జ్ఞానం కూడా తేనెలాటిదే గొప్పవాడి అనుభవాలు తేనెతుట్టెలాంటివి. అవి కష్ట సుఖాల మిళితం. వాటినుంచి అతడు జ్ఞానాన్ని పిండి మనకిస్తాడు.

ఇటీవల వచ్చిన పుస్తకాల్లో ఈ 'జొనాథన్ లివింగ్ స్టన్' కొన్ని మిలియన్ కాపీలు అమ్ముడుపోవడానికి కారణం, ఆ కథ చెప్పటంలో రచయిత చూపిన 'అమాయకత్వపు నిజాయితీతో కూడిన' ఒక చిన్న పక్షి పట్టుదల.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments